వైఎస్ఆర్
కడప-అన్నమయ్య
తెలుగు దినపత్రిక
వార్త
బుధవారం 11 ఫిబ్రవరి 2026

ఏపీఎస్ఆర్టీసీపై సమీక్ష

రాయచోటి ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :

అమరావతిలోని సచివాలయంలో ఏపీఎస్ఆర్టీసీపై రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సుదీర్ఘ చర్చలలో పాల్గొన్న రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గి.కృష్ణబాబు, కమీషనర్ మనీష్ కుమార్ సిన్హా, RTC ఉన్నత అధికారులతోఆర్టీసీ సేవల మెరుగుదల, ప్రయాణికులకు సౌకర్యాలు, పనితీరు అంశాలపై మంత్రి అధికారులతో చర్చించారు.

రైతులు మట్టి నమూనాలు చేయించుకోండి

దువ్వూరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

మండలంలోని రైతులు తమ పొలాల్లోని మట్టి సేకరించి నమూనాలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నీలాపురం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి నమూనాలు సేకరించి రైతు సేవా కేంద్రంలో అందజేస్తే వాటిని ల్యాబ్‌కు పంపి మట్టిలో ఏ ఏ పోషక విలువలు ఎంత ఉన్నాయనే విషయాన్ని సంబంధించి వాటికి సలహాలు ఇస్తామన్నారు. వాటి ప్రకారం రసాయనిక ఎరువులు వాడవచ్చు అన్నారు. అలాగే నీలాపురం గ్రామంలో సాగుచేసిన సజా.., మొక్కజొన్న, జొన్న వంటి పంటలను పరిశీలించి తగిన సూచనలు అందజేస్తామన్నారు.

చెరువులో .... రిజిష్టరు

: నకిలీ రిజిష్టరుతో చెలామణి

: మాముళ్లు తీసుకుని రిజిష్టర్ చేసిన వైనం

: చోద్యం చూస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

: మండిపడుతున్న నీటి సంఘాల నాయకులు

బద్వేలు , ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :

కబ్జాలకు అడ్డాగా మారిన నాగులచెరువును ఆక్రమించేందుకు కబ్జాదారులు అనేక రూపాలలో ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. చెరువును ఆనుకుని ఉన్న ప్రతి ఒక్కరూ ఆక్రమించినప్పటికీ ఇరిగేషన్ అదికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాదాకరం. అయితే ఒక వ్యక్తి మరొ అడుగు ముందుకేసి చెరువుకు ఆనుకుని ఉన్న రిజిష్టర్ స్థలాల పక్కనే మరో సర్వేనెంబరుతో రిజిష్టర్ చేయించుకుని దర్జాగా చెలామణి అవుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న నీటి సంఘం నాయకులు అధికారుల తీరుపైమండిపడుతున్నారు. చెరువును కాపాడాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ అదికారులే ఇలా కబ్జాలకు పాల్పడుతున్న వారికి వత్తాసు పలికితే నడిబొడ్డున ఉన్న చెరువు పూర్తిగా కబ్జాకు గురికాదా అని ప్రశ్నిస్తున్నారు. 2024వ సంవత్సరం మే నెలలో ఒక వ్యక్తి సర్వే నెం. 1157/ 1 ఆధారంగా 6 సెంట్లు స్థలం రిజిష్టరు చేయించుకున్నారు. అప్పటి సబ్ రిజిష్టారు కార్యాలయంలో స్థలానికి సర్వేనెంబరుకు సంబంధం లేకుండా రిజిష్టర్ చేయించారని నీటి సంఘం నాయకులు సురేంద్ర బద్వేలు ఆర్డీవోకు ఫిర్యాదుచేశారు. స్థలాన్ని పరిశీలిస్తే చెరువులో రిజిష్టరు అయినట్లు స్పష్టంగా కనపడుతుందని అయినప్పటికీ ఈ స్థలం ఎలా రిజిష్టరు అయ్యిందని, రిజిష్టరు చేయించుకున్న వ్యక్తి ఇన్ని రోజులు మౌనంగా ఉండి ఈ మధ్యకాంలో నెమ్మదిగా ఆ స్థలంలో మట్టితోలే ప్రయత్నంచేస్తున్నారు. ఆ చుట్టుపక్కల ఉన్న స్థలాలే ఆక్రమణకు గురయ్యాయని రైతులు లబోదిబో మంటూ అదికారులకు ఫిర్యాదులు చేస్తుంటే ఇప్పుడు ఏకంగా చెరువునే రిజిష్టర్ చేయించి చెలామణి అవుతున్న ఆ వ్యక్తి తీరును, ఇందుకు సహకరించిన అధికారులపై నీటిసంఘం నాయకులు, ప్రజలు మండిపడుతున్నారు. నాగుల చెరువు కబ్జాకు గురవుతుందని హద్దులు ఏర్పాటుచేసి చెరువును కాపాడాలని నీటి సంఘం నాయకులు కోర్టును ఆశ్రయిస్తే అధికారుల నిర్లక్ష్యం వలన కోర్టు కూడా ఆగ్రహించి ఉత్తర్వులు జారీ చేసి హద్దులు తేల్చాలని సూచించినప్పటికీ అధికారులు మాత్రం నామమాత్రంగా వదిలేశారు. నాగుల చెరువులో కబ్జాలను తొలగించాలంటే అధికారులకు ఎందుకంత అలసత్వమో తెలియదు కాగాని, కబ్జాలు జరుగుతుంటే చూస్తుండడంపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువు స్థలం కదా ఎవరు పట్టించుకోరనే ఉద్దేశ్యంతో ఎవరి సత్తాను బట్టి కబ్జాచేయడమే కాకుండా ఏకంగా ఎక్కడో సర్వేనెంబరు వేసి రిజిష్టరు చేయిస్తున్నారంటే ఇంతకన్నా మరొకటి ఉండదని నీటి సంఘం నాయకులు సురేంద్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని మరొకరు ఇలాంటి సాహసాలు చేయకుండా ఉండాలంటే ఆ రిజిష్టరును రద్దుచేసి , నకిలీ రిజిష్టరుకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని పలువురు మండిపడుతున్నారు. ఇంత జరుగుతున్నా నీటి పారుదల శాఖ డిఈ నిర్లక్ష్యంగా ఉండడమే కాకుండా ఆ అధికారి తీరువల్లే చెరువును కాపాడలేకపోతున్నారని వారు అంటున్నారు.

తక్షణమే రిజిష్టరు రద్దుచేసి చర్యలు తీసుకోవాలి:

నాగుల చెరువులో నకిలీ రిజిష్టరుకు పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకుని ఆ రిజిష్టరును రద్దు చేయాలని నీటి సంఘం నాయకులు కొర్రపాటి సురేంద్ర అన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే చెరువులో రిజిష్టర్ జరిగిందని, అది కూడా ఎక్కడో సర్వేనెంబరు వేసి రిజిష్టరు చేశారని ఈ విషయం ఆర్డీవోకు తెలియజేశామన్నారు. సబ్ రిజిష్టర్ కార్యాలయంలో విచారించగా అప్పట్లో అధికారులు చేశారని మౌనంగా ఉండిపోయారు. ఇటు రెవెన్యూ, అటు ఇరిగేషన్ శాఖాధికారుల నిర్లక్ష్యం వలనే నాగుల చెరువు పూర్తిగా కబ్జాకు గురైందని ఇప్పటికైనా చెరువులో హద్దులు తేల్చాలని నకిలీ రిజిష్టరు పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని సురేంద్ర అన్నారు.

కొర్రపాటి సురేంద్ర, చిన్నతూము నీటి సంఘం అధ్యక్షులు.

శాసనసభ్యులు ప్రత్యేక క్రీడా పోటీలలో పాల్గొనాలి

రాయచోటి ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :

శాసనసభ్యులు,ఎమ్మెల్సీలు ప్రత్యేక క్రీడా పోటీల్లో పాల్గొనాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు మరియు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగినట్లు ఒక ప్రకటనలో తెలియజేశారు. సమావేశంలో: రాజకీయ ఒత్తిడిలో నిరంతరం గడిపే ప్రజాప్రతినిధులకు మానసిక ఉల్లాసాన్ని, కొత్త ఉత్సాహాన్ని ఇచ్చేందుకు శాసనసభ సభ్యులు (ఎమ్మెల్యేలు), మండలి సభ్యులకు (ఎమ్మెల్సీలు) ప్రత్యేక క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. మంగళవారం అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ లతో కలిసి ఆయన ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు.గత ఏడాది తరహాలోనే ఈసారి కూడా అత్యంత వేడుకగా ఈ కార్యక్రమాలను నిర్వహించాలని స్పీకర్ అధికారులను ఆదేశించారు. బడ్జెట్ సమావేశాల సమయంలో నాలుగు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. ఒక రోజు సాంస్కృతిక కార్యక్రమాలు,క్రీడాలలో గెలిచిన వారికి బహుమతులు ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వారి ఆసక్తిని బట్టి పురుషులకు, మహిళలకు విడివిడిగా వివిధ క్రీడా పోటీలను ఏర్పాటు చేయనున్నారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విప్‌లు అనురాధ, యార్లగడ్డ వెంకటరావు, కూన రవికుమార్, సాప్ (SAP) చైర్మన్ రవినాయుడు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొని పలు సూచనలు చేశారు. త్వరలోనే ఈ క్రీడల పూర్తి షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేయనున్నట్లు వారు తెలిపారు.

ఉల్లిపాయల మాటున గంజాయి స్మగ్లింగ్

రూ. 44.65 లక్షల విలువైన 179 కేజీల గంజాయి స్వాధీనం

ఇద్దరు అరెస్ట్ - నలుగురి కోసం గాలింపు

జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త.

జిల్లాలో మాదకద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న పోలీసు యంత్రాంగం మరో భారీ గంజాయి స్మగ్లింగ్‌ను ఛేదించింది. ఉల్లిపాయల వ్యాపారం ముసుగులో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముఠాను మదనపల్లె తాలూకా పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మీడియాకు వెల్లడించారు. డీఎస్పీ మహేంద్ర పర్యవేక్షణలో మదనపల్లె తాలూకా సీఐ కళా వెంకటరమణ, సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం తిరుపతి ప్రధాన రహదారిలోని యర్రగానిమిట్ట వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో నంబర్ లేని లగేజీ ఆటోను తనిఖీ చేయగా, పైన ఉల్లిపాయల బస్తాలు పేర్చి, కింద ఉన్న తొమ్మిది ఉల్లిపాయల బస్తాల్లో దాచిన దాదాపు 179 కేజీల గంజాయి బయటపడింది. దీని విలువ సుమారు రూ. 44,65,000 గా అంచనా వేశారు. ఆటోలో గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న చంద్రాకాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ఆవుల నాగరాజ (23), ఆవుల సుగుణ (29) ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. వీరిపై ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశసరు. ఈ ముఠాలో ఉన్న మరో నలుగురు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మదనపల్లె పరిసర ప్రాంతాల్లో యువతను మత్తుకు బానిసలుగా చేస్తున్న ముఠాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. గంజాయి రవాణా చేసినా, విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు కూడా ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడంలో సహకరించాలని కోరారు. భారీ గంజాయిని పట్టుకున్న మదనపల్లె తాలూకా పోలీస్ అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

వైభవంగా పుంగమ్మ మరవ నీరువిడుద

పుంగనూరు రూరల్ ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

పుంగమ్మ చెరువుకు కృష్ణ జలాలు చేరిన నేపథ్యంలో గ్రామ సాంప్రదాయాల ప్రకారం మంగళవారం కోనేటిపాలెం వద్ద ఉన్న మరవ నీటినిను విడుదల చేసే కార్యక్రమం కన్నుల పండుగగా నిర్వహించారు. పట్టణంలోని చెంగారెడ్డి వీధి నుండి నగరి వీధుల గుండా అమ్మవారికి పూజాది ద్రవ్యాలు ఊరేగింపుగా తీసుకెళ్లారు. టౌన్ రంగారెడ్డి కుటుంబ సభ్యులు తమ పూర్వీకుల కాలం నుంచి వస్తున్న ఆచారాన్ని అనుసరించి తల్లికి సారె సమర్పించి విశేష పూజలు చేశారు. ఊరి ఆచారం మేరకు మేకపోతలు, ఎద్దుపోతను అమ్మవారికి సమర్పించారు. మరవ వద్ద ప్రత్యేక పూజలు చేసి మరవను విడుదల చేశారు మరువను చూసేకి పెద్ద ఎత్తున పట్టణ ప్రజలు తరలివచ్చి ఆసక్తిగా చూశారు. కార్యక్రమంలో టౌన్ రంగారెడ్డి వంశస్థులు పగడాల పృథ్వీధర్, పగడాల సందీప్, పగడాల హరి, పగడాల బాబు, టీపీఎస్ నాగరాజా, విక్కీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మోసం, బెదిరింపు కేసులో
ఐదుగురు అంతర్‌రాష్ట్ర మోసగాళ్లు అరెస్ట్

- రూ.8.50లక్షలు స్వాధీనం

ప్రొద్దుటూరు క్రైం, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

మోసం బెదిరింపులో కేసులో ఐదుగురు అంతర్‌రాష్ట్ర మోసగాళ్లను అరెస్టు చేసినట్లు ఏఎస్పీ విభుకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రొద్దుటూరు టుటౌన్ పరిధిలో ఐదుగురు నిందితులు ఆదిమూలం గంగప్రసాద్ అనే వ్యక్తి నుంచి రూ.33లక్షలు నగదు ఇస్తే రూ.50లక్షలు ఖాతాలో జమ చేస్తామని నమ్మించి మోసం చేశారు. ఈ కేసులో నిందితులు గంగులయ్య, పఠాన్ సత్తార్, అంకం నాగేష్, ఎం.గోపాల్‌రెడ్డి, తిరుపతి పెంచలయ్యలపై గత ఏడాది జనవరి 7న కేసు నమోదైంది. అప్పటి నుంచి నిందితులు కనిపించకుండాపోయారు. వారి కదలికలపై నిఘా ఉంచడంతో మంగళవారం పోలీసులు గుర్తించి వారిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. వారి నుంచి రూ.8.50లక్షలు నగదు, ఒక సూట్‌కేస్, ఒక కత్తిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కేసులో నిందితుల అరెస్టుతో అసాధారణ నిబద్ధత మరియు వృత్తిపరమైన నైపుణ్యం కనబరిచిన అధికారులు, సిబ్బందిని అభినందించి వారికి రివార్డులు అందజేయడం జరిగిందన్నారు.

మూడో కోళ్ల ఫారంలోను తేలిన బర్డ్ ఫ్లూ

సదుం ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

మండల పరిధిలో ఇటీవల పుట్ట వారి పల్లె, కంభం వారి పల్లె, అమ్మగారిపల్లె గ్రామాల వద్దనున్న కోళ్ల ఫారం లలో వందలాది కోళ్లు చనిపోయాయి. అప్పట్లో అధికారులు వచ్చి శాంపుల్స్ సేకరించి మధ్యప్రదేశ్ లోని భోపాల్ ల్యాబ్ కు పంపించారు. అక్కడ పుట్టా వారి పల్లె, అమ్మగారి పల్లె వద్దనున్న కోళ్ల ఫారాల్లోని నాటు కోళ్లకు బర్డ్స్ ఫ్లూ ఉన్నట్లు తేలింది. అదేవిధంగా కంభంవారి పల్లె వద్దనున్న కోళ్ల ఫారం నుంచి తీసిన శాంపిల్స్ ఫలితం మంగళవారం వచ్చింది. అక్కడ కూడా బర్డ్ ఫ్లూ ఆనవాళ్లు కనబడడం జరిగిందని అధికారులు చెప్పారు. దీంతో ముందు జాగ్రత్త చర్యలను తీసుకుంటున్నారు. కోళ్ల ఫారాల వద్దకు ఎవరిని పంపించడం లేదు. అక్కడ ఉన్నటువంటి కోలన్నిటిని ఇప్పటికే గోతులు తవ్వి పూడ్చి పెట్టేసారు. మరో రెండు నెలల వరకు ఆ కోళ్ల ఫారాలలో కోళ్లు పెట్టరాదని ఆదేశాలు ఇచ్చారు. అదేవిధంగా ఇతర ప్రాంతాల నుంచి కోళ్లు రాకూడదని ఇక్కడి నుంచి కోళ్లను బయటకు పంపరాదని అధికారులు దండోరా వేయించారు. సదంలోని పంచాయతీరాజ్, పోలీస్, రెవెన్యూ, గ్రామ సచివాలయాలు ,వెటర్నరీ అధికారులు కలిసి సామూహికంగా ప్రజలకు చైతన్యం కల్పిస్తున్నారు.

ప్రొద్దుటూరును రాయలసీమ ఎకానమీ పవర్ హబ్ గా అభివృద్ధి చేస్తాం..

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

వాణిజ్య పరంగా అత్యంత ప్రసిద్ధిగాంచిన ప్రొద్దుటూరును రాయలసీమలో ఒక ప్రత్యేక ఎకానమీ పవర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. మంగళవారం ప్రొద్దుటూరు మున్సిపల్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రొద్దుటూరు నియోజక వర్గ స్థాయి సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తోపాటు జాయింట్ కలెక్టర్ నిధి మీనాజ్, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ప్రొద్దుటూరు ఏఎస్పి విభూ కృష్ణ జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాణిజ్య పరంగా పేరున్న ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో ఎప్పటినుండో అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి, అధునాతన, సాంకేతిక పద్ధతితో భూగర్భ డ్రెయినేజీని చేపడుతామన్నారు. అందుకోసం పట్టణములోని అన్ని ప్రధాన డ్రైనేజీ కాలువలు ఆనుకుని ఉన్న నివాసాలు, ఆక్రమ కట్టడాలను తొలగించి, కాలువలను విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించి చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీ పరిధి నుండి గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరించి ఉన్న మదూరు కాలువ సమస్యను కూడా శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ప్రత్యేకమైన పారిశుద్ధ్య చర్యలను చేపట్టాలని జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అవసరమైతే అదనంగా పారిశుద్ధ్య కార్మికులను కూడా నియమించు కోవాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ఇప్పటివరకు అపరిష్కృతంగా ఉందన్న పారిశుధ్య సమస్యకు సంపూర్తిగా పరిష్కారం చూపాలన్నారు. స్వచ్ఛఆంధ్రప్రదేశ్ లక్ష్యం సాధనలో భాగంగా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ వంద శాతం స్వచ్ఛతను సాధించేందుకు ప్రతి అధికారి కృషి చేయాలన్నారు.

ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులను ఈ ఆర్థిక సంవత్సరంలోగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే పనులు మొదలు పెట్టి పురోగతిలో ఉన్న వాటిని మార్చి 15 లోపు పూర్తి చేయాలన్నారు. ఇంకా మొదలు పెట్టాల్సిన పనులను కూడా నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయగలిగితేనే మొదలు పెట్టాలన్నారు. త్వరితగతిన చేయగలిగిన గోకులం షెడ్స్, సిసి రోడ్లు, బిటి రోడ్లు, డబ్ల్యూ ఎం రోడ్లు, కాంపౌండ్ వాల్ మొదలైన పనులను ఎంపిక చేసుకుని 100 పూర్తి చేసేలా మొదలు పెట్టాలన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో పుష్కలమైన సాగునీటి సదుపాయాలు ఉండడంతో వ్యవసాయ పంటల సాగు విస్తీర్ణం అధికంగానే సాగుతొందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, ఉద్యాన పంటలతో పాటు పశుసంపదను, పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలన్నారు. అందుకోసం డిఆర్డీఏ, మెప్మా, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు. సుస్థిర మార్కెటింగ్ అభివృద్ధికో ఫ్రీ ట్రస్ట్ మార్కెటింగ్ విధానం ద్వారా స్వేచ్ఛా పారదర్శక విక్రయాలు చేపట్టడం జరుగుతుంది. ఇప్పటికే జిల్లాలో సంప్రదాయ వ్యవసాయ పంటలు కాకుండా భవిష్యత్తులో దీర్ఘకాలిక ఆదాయాన్ని ఇచ్చే ఉద్యాన పంటలను పండించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రత్యేకించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లతో పాటు, సుఖ ప్రసవాలను చేయడం జరుగుతోందన్నారు. ముందుగా ఎనిక్రోచ్మెంట్ కు సంబంధించిన అన్ని కార్యక్రమాలను ఒక్క నెలలోపు పూర్తి చేయలన్నారు. బులియన్ మార్కెట్ లో పెరిన్నికగన్న ప్రొద్దుటూరు పట్టణంలో బంగారు నగల తయారీ పరిశ్రమ క్లస్టర్ ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం అవుతాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ విలువలతో కూడిన నాయకత్వం, పారదర్శకత తో కూడిన విధి నిర్వహణ అధికారులను కానీ, నాయకులను కానీ అత్యున్నత స్థాయికి తీసుకువెళుతాయని తెలిపారు. అనంతరం డ్వామా, డిఆర్డీఏ, మెడికల్, ఐసిడిఎస్, విద్యా శాఖ, వ్యవసాయ మార్కెటింగ్, విద్యుత్ శాఖ, పరిశుధ్యం, రవాణా, ట్రాఫిక్, పరిశ్రమలు, వాణిజ్యం తదితర అంశాలపై సంబందిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు సమీక్షించి పలు సలహాలు, సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, జెడ్పి సీఈవో ఓబులమ్మ, ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి, వాల్మీకి బోయ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, స్థానిక నాయకులు, పట్టణాధ్యక్షులు, అడ్వకేట్ సుధాకర్ రెడ్డి, కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, అన్నిశాఖల జిల్లాస్థాయి, డివిజనల్, నియోజకవర్గ స్థాయి అధికారులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి పోలీస్ కార్యాలయంలో భారీ కుంభకోణం

:రూ. 32 లక్షల జీతాల నిధులు గోల్‌మాల్..!

మదనపల్లె క్రైమ్ ఫిబ్రవరి 10 ప్రభాతవార్త.

రక్షణ కల్పించాల్సిన శాఖలోనే భారీ అక్రమం వెలుగుచూసింది. అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జీతాల చెల్లింపుల్లో జరిగిన అవినీతి వ్యవహారం కలకలం రేపుతోంది. సుమారు 32 లక్షల రూపాయల పోలీస్ సిబ్బంది వేతన నిధులను దారి మళ్లించినట్లు నిర్ధారణ కావడంతో, విధుల్లో ఉన్న ఒక జూనియర్ అసిస్టెంట్ మరో 15 మందిపై కేసు నమోదైంది. జిల్లా పోలీస్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ప్రతినెల 30 వేల రూపాయలకు దొంగ బిల్లులు సృష్టించి తనకు అనుకూలమైన ఉద్యోగుల ఖాతాల్లో వేసుకునేవారు. తన అధికార పరిధిని ఉపయోగించుకుని, ఖాతాల్లో మార్పులు చేయడం ద్వారా సుమారు రూ. 32 లక్షల మేర చేతివాటం ప్రదర్శించాడని ప్రాథమిక విచారణలో తేలింది. ఇటీవల ఒక మృతి చెందిన హోంగార్డు వేతనంలో రు. 30 వేలు జమ కావడం ఎస్పీ దృష్టికి రావడంతో, అడిషనల్ ఎస్పీ వెంకటాద్రిని విచారం చేయాల్సిందిగా ఆదేశించారు. గత కొంతకాలంగా ఈ నిధుల మళ్లింపు జరుగుతున్నా, ఇటీవలే అంతర్గత తనిఖీల్లో ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. సిబ్బంది వేతనాల్లో వ్యత్యాసాలను గమనించిన ఉన్నతాధికారులు లోతుగా విచారించగా, ఈ భారీ కుంభకోణం బయటపడింది. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ నిధులను, ముఖ్యంగా సిబ్బంది కష్టార్జితాన్ని దుర్వినియోగం చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే సదరు జూనియర్ అసిస్టెంట్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి సస్పెండ్ చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఈ కుంభకోణంలో ఇంకా ఎవరి పాత్ర అయినా ఉందా? అన్న కోణంలో విచారణ జరుపుతున్నామని ఆయన పేర్కొన్నారు. దర్యాప్తు నివేదిక ఆధారంగా నిందితుడిపై తదుపరి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శాంతిభద్రతలను పర్యవేక్షించే పోలీస్ కార్యాలయంలోనే ఇంతటి భారీ స్థాయిలో అవినీతి జరగడం స్థానికంగా, పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ నిధుల రికవరీ ని ఎలా చేస్తారంటూ పలువురు ఎదురుచూస్తున్నారు.

కన్యాశుల్కంతో బాల్య వివాహం.... బాలికా వధువుకు అన్యాయం

పుంగనూరు ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

కన్యాశుల్కానికి ఆశపడి ఒక తల్లి రూ.2 లక్షలకు 14 ఏళ్ళు కూడా నిండు తన కూతురుని బేరం పెట్టింది. రూ.50 వేలు అడ్వాన్సుగా తీసుకొని 14 ఏళ్ల చిన్నారిని వ్యక్తికిచ్చి వివాహం జరిపించింది. అభం శుభం ఎరుగని ఆ చిన్నారి పెళ్లికూతురు వరుడి వేధింపులు భరించలేక చిన్నాన్న లోకేష్ సాయంతో బయటపడింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఉదంతం వెనుక వివరాలివి.అన్నమయ్య జిల్లా పుంగనూరు పట్టణంలోని ప్రకాశం కాలనీకి చెందిన 8వ తరగతి చదువుతున్న బాలికను కర్ణాటక రాష్ట్రం రాయల్పాడుకు చెందిన రాజశేఖర్‌అనే వ్యక్తికిచ్చి పది రోజుల క్రితం వివాహం జరిపించిన పెద్దమనిషి రెడ్డప్ప. బాలిక తల్లిదండ్రులు ఘర్షణ పడి కొన్నేళ్లుగా దూరంగా ఉంటున్నారు. తండ్రి రామరాజుకి తెలియకుండా తల్లి శోభ ఎదురుకట్నం ఇచ్చేలా రెడ్డప్ప అనే పెద్దమనిషి తో ఒప్పందం కుదుర్చుకుని ఇదంతా జరిపించారు. వివాహం అనంతరం వరుడి వేధింపులు తాళలేక బాలికా వధువు చిన్నాన్న లోకేష్ కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. లోకేష్ మాట్లాడుతూ హేమశ్రీ ని చిత్రహింసలకు గురి చేసి ఇష్టం లేని వివాహం జరిపించారాని తెలుసుకొని అతను సోమవారం పోలీసులకు ఈ విషయం చెప్పడంతో వారి సాయంతో బాలిక తండ్రి చెంతకు చేరింది. వీరికి ముగ్గురు కుమార్తెలు కాగా పెద్దకుమార్తె హేమశ్రీకి తల్లి వివాహం చేసిందని తండ్రి, బంధువులు చెబుతున్నారు.పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది

ఆటో డ్రైవర్ యూనియన్ అధ్యక్షుడిగా శ్రీనివాసులు

తంబళ్లపల్లె ఫిబ్రవరి 10 ప్రభాతవార్త ః

మండల మారుతీ ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడిగా శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఎన్టీఆర్ సర్కిల్లో సిఐటియు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి ప్రభాకర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఆటో యూనియన్ ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా మోహన్, వెంకటేష్ ప్రధాన కార్యదర్శిగా వి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులుగా ఆనంద్, ప్రసాద్ కోశాధికారిగా చిన్నాలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు రోడ్డు నియమ నిబంధనలు పాటిస్తూ చట్టానికి అనుగుణంగా నడుచుకోవాలన్నారు. మీ సమస్యల పరిష్కారానికి సిఐటియు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఏఎస్ఐ నజీర్ భాషా మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు రికార్డులతో పాటు లైసెన్స్ కలిగి అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటించి క్షేమంగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, సిఐటియు సభ్యులు పాల్గొన్నారు.

మల్లయ్యదారు శారదయ్యకు నివాళులు

తంబళ్లపల్లె ఫిబ్రవరి 10 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె కు సమీపంలోని మల్లయ్య కొండ మహా శివుని దశాబ్దాలుగా ఆరాధిస్తూ మల్లయ్యదారు వేషధారణలో ప్రచారం నిర్వహించే మల్లయ్య దారు శారదయ్య సోమవారం మృతి చెందారు. మంగళవారం తంబళ్లపల్లె నియోజకవర్గం చెందిన భక్తులు, ప్రజలు, పలు పార్టీల రాజకీయ నాయకులు పెద్దమందెం మండలం కురవపల్లి లో ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి మల్లయ్య కొండ మల్లయ్య దారుల వేషధారణలో శారదయ్య మల్లయ్య కొండ మహా శివునికి చేసిన సేవ మరువ రానిదన్నారు. అనంతరం ఘనంగా నివాళులర్పించి అంతక్రియల్లో పాల్గొన్నారు.

శ్రీరాముని సేవలో కుప్పాల

సిద్ధవటం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:

శ్రీ సీతారామ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి ఆలయం తొలి వార్షికోత్సవం సందర్భంగా పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరమని ప్రతి ఒక్కరికి భగవంతుని అనుగ్రహం ప్రసాదించి వారి కుటుంబాలు సుఖ సంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి రవిచంద్ర, సింగల్ విండో మాజీ అధ్యక్షులు సుధా, మురళి, ఆ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిపై ఆకేపాటి అబద్ధాలు మాట్లాడవద్దు

సిద్ధవటం ఫిబ్రవరి10 ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు పార్లమెంటు ఉపాధ్యక్షుడు నాగ మునిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దేవుడు శ్రీవెంకటేశ్వర స్వామి లడ్డు గురించి రాజంపేట వైసీపీ ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుపై అబద్ధాలు ఆడడం సరి కాదన్నారు. 2014 నుండి 2019 వరకు కల్తీ జరిగింది అని స్వామి వారి భక్తుడైన రాజంపేట వైసీపీ ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి చెప్పడాన్ని స్వామి వారు కూడా, క్షమించరన్నారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధికి ప్రతి ఏడాది వందలాది భక్తులతో పాదయాత్రలు నడిచి వెళ్ళే రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి ఎమ్మెల్యే వైవి సుబ్బా రెడ్డి హయంలో జరిగిన ఘోర తప్పిదం ను ఒప్పుకోక పోవడం ఆశ్చర్యంగా ఉంది అన్నారు. ఈ ప్రెస్ మీట్ లో పాల్గొన్న పార్లిమెంట్ ఉపాధ్యక్షులు నాగముని రెడ్డి,మల్లు వెంకట సుబ్బారెడ్డి, సంజీవరాయుడు, పార్ల శ్రీనివాసులు, అక్కిశెట్టి మణి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు అండ

సిద్ధవటం ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:

సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సిద్ధవటం మండలం మాధవరం-1 గ్రామానికి చెందిన గోస్పాతుల హరి కుమారి రూ.2,39,592/ చెక్కును కడప పొలిటికల్ బ్యూరో సభ్యులు శ్రీ రెడ్డెప్ప గారి శ్రీనివాసుల రెడ్డి చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగముని రెడ్డి పాల్గొని ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం, కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తూ, అవసరమైన సమయంలో తక్షణ సహాయాన్ని అందిస్తోంది. ముఖ్యంగా పేదలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం టీడీపీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు

కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ముద్దనూరు, ఫిబ్రవరి,10 ప్రభాతవార్త:

కందుల కొనుగోలు కేంద్రాన్ని మండలంలో ఏర్పాటు చేయకుండా డిసిఎంఎస్ అధికారులు ఎర్రగుంట్ల పట్టణంలో ఏర్పాటు చేయడం చాలా దారుణమని మంగళవారం మండల రైతులు వాపోతున్నారు. మండలంలోని సొసైటీ కి సంబంధించి మూడు గోడౌన్లు ఉన్నా మండలంలో ఏర్పాటు చేయకుండా అధికారులు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని రైతులు తెలిపారు. మండల పరిధిలో 19 గ్రామ పంచాయతీల పరిధిలోని రైతులు కందుల కొనుగోలు కేంద్రానికి ఎర్రగుంట్లకు వెళ్లాలంటే ట్రాక్టర్లు ఆటోలతో చాల డబ్బులు ఖర్చు అవుతా యని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేద వ్యక్తం చేశారు. కావున తక్షణం అధికారులు స్పందించి ముద్దనూరులో కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని లేని పక్షంలో మండల వ్యాప్తంగా రైతులు ఆందోళన చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మాధవరం1లో ఉచిత కంటి పరీక్షలు

సిద్ధవటం ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:

మండలంలోని మాధవరం1 గ్రామంలో పాత పంచాయతీ కార్యాలయ భవనంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విషేశ స్పందన లభించింది. అక్షర దృష్టి ఛారిటబుల్ ట్రస్ట్ మరియు కడపలోని మా ఐ కేర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ శిబిరంలో ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు, ఫాకో మరియు గ్లకోమా సర్జన్ డాక్టర్ దినేష్, డాక్టర్ యు. సింధు భార్గవి తమ బృందంతో కలిసి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.చికిత్స మరియు సలహాలుముఖ్యంగా కంటి శుక్లాలు (క్యాటరాక్ట్), కంటిపై మాంసం పెరగడం (స్టెరిజియమ్) మరియు కంటి నరాల సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి తగిన చికిత్సలు మరియు సూచనలు అందించారు. సుమారు 40 నుండి 50 మంది గ్రామస్తులు ఈ శిబిరాన్ని సందర్శించి ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఉచిత శస్త్రచికిత్సలుశిబిరంలో కంటి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించిన పేద రోగులకు ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడం విశేషం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న లబ్ధిదారులు నిర్వాహకులకు మరియు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

అల్లా ను ఆరాధించాల్సిన మజీదులో సన్మానాలు తగదు

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

ముస్లిం సమాజం ఎంతో పవిత్రంగా అల్లాను ఆరాధిస్తూ ప్రార్థనలు జరిపే మజీద్ లో వ్యక్తులకు పొగడ్తలు సన్మానాలు చేయడం తగదని, ఈ సంఘటనపై ముస్లిం యావత్ సమాజం విస్మయం వ్యక్తం చేస్తోందని ప్రొద్దుటూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ భాష పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్గా వి ఎస్ ముక్తియార్ నియమించబడటం సంతోషకరమన్నారు. ముస్లిం సమాజానికి మేలు చేసే పదవిని పొందడం తో విఎస్ ముక్తియార్ కు యావత్ ముస్లిం సమాజం అభినందనలు తెలుపవచ్చు అన్నారు. కానీ అభినందనలు సన్మానాలు ప్రైవేటు స్థలాలలో చేయాల్సింది పోయి పవిత్ర స్థలాలైన మజీదులో రాజకీయ వేదికలుగా మార్చి సన్మానాలు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు మసీదు అనేది ప్రతి ఒక్కరూ సమానంగా నిలబడి ప్రార్థనలు చేసే పవిత్ర స్థలమని అలాంటి ప్రదేశాలను రాజకీయ లేదా ప్రభుత్వ కార్యక్రమాలకు వేదికలుగా మార్చడం కురాన్ ఆదేశాలకు పూర్తిగా విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల విఎస్ ముక్తియార్ ను నజీరుల్లాషా మజీద్ లో సన్మానించడంపై ప్రొద్దుటూరు ముస్లిం ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ ఘటనపై మత పెద్దలు అలీములు ముఫ్తీలు మౌనం వీడి ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగం ప్రకారం భారత్ లౌకిక దేశమని మత సంస్థల వ్యవహారాల్లో ప్రభుత్వం లేదా రాజకీయ నాయకుల జోక్యం ఉండకూడదని తెలిపారు. దేవాలయాలు మసీదులు చర్చిలు వంటి మతసంస్థల్లో రాజకీయాలకు ఎలాంటి స్థానం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రొద్దుటూరు లోని అంజుమన్ అహేలే ఇస్లాం కమిటీ రాజకీయ పార్టీలకు అతీతంగా పూర్తిగా స్వతంత్రంగా ముస్లిం సమాజానికి సేవ చేయాలని ఆయన డిమాండ్ చేశారు కూటమి ప్రభుత్వంతో చట్టపట్టాలు వేసుకొని తిరుగుతూ మసులుది వ్యవహారాల్లో రాజకీయ ప్రభావం చూపుతున్నారనే తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయని ఆయన అన్నారు. కొంతమంది ముస్లిం వ్యక్తులు ఒక రింగుల ఏర్పడి అంజుమన్ కమిటీని తమ

చేతుల్లో బంధించి శాసిస్తున్నారని ఈ రాజకీయాలు మసీదుల పవిత్రతను మంట కలుపుతున్నాయని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇలాంటి సేవా సంస్థల్లో అధ్యక్షులుగా సభ్యులుగా ఐదు పూటల నమాజ్ కట్టుబడి పాటించే వారికి అవకాశం కల్పించాలని సూచించారు. భవిష్యత్తులో మజీదులు సన్మానాలకు నిలయంగా మారకూడదని ప్రార్థన స్థలాల గౌరవాన్ని కాపాడడం సమాజం బాధ్యత అని ఆయన తెలిపారు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలు దిద్దుబాటు చేసుకోవాలని లేకపోతే ఢిల్లీలోని లా బోర్డును కలిసి ఫిర్యాదు చేస్తానని ఆయన తెలిపారు.

12న చేపల చెరువులకు వేలంపాట

రామసముద్రం పిబ్రవరి 10 ప్రభాతవార్త

మండలంలోని కాప్పల్లె గ్రామపంచాయతీ కి సంబంధించిన చేపల చెరువు వేలములు 1) పాయ చెరువు 2)చల్లా చెరువు 3)బురుజు ఒడ్డు 4)కొత్త ఒడ్డు5) చింతమా ను ఒడ్డు చేపలచెరువులు వేలం పాటలు నిర్వహిస్తున్న ట్లు డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్ పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి తెలిపారు. 12తేదీగురువారం న ఉదయం 11 గంటలకు ప్రజల సమక్షంలో నిర్వహిస్తామని ఆసక్తి కలవారు డిపాజిట్ చెల్లించి వేలం లో పాల్గొనాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ వితరణ

కేవీ పల్లె, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మఠంపల్లి గ్రామం కేవి పల్లి మండలం లో తరిగొండ భాస్కర్, తరిగొండ నారాయణమ్మ కుమారుడు తరిగొండ మురళి పాఠశాలకు 40 వేల రూపాయల విలువగల కంప్యూటర్ మరియు ప్రింటర్ వితరణ చేయడం జరిగింది. కార్యక్రమానికి లీనివీ శ్రీ శి రెడ్డి బాషా, బీలీ ప్రభాకర్, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం మరియు గ్రామస్థులు హాజరయ్యారు.

సుబ్రహ్మణ్యంకు గ్రామంలో అంత్యక్రియలు

రామసముద్రం పిబ్రవరి 10 ప్రభాతవార్త

బి.కొత్తకోటలో సచివాలయ ఉద్యోగి సుబ్రహ్మణ్యం సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డ విషయం తెలిసిందే. ఈ ఘటనతో అతని స్వగ్రామమైన రామసముద్రంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.గ్రామానికి పార్థి వదేహం స్వగ్రామానికి రావడం తో బంధువులు, స్నేహితులు కన్నీరు చెందారు, స్నేహితులు చిన్న నాటి నుండి అతని తో గడిపిన స్మృతులను తలచుకుంటూ కన్నీటి పరవాంతమయ్యారు. సుబ్రహ్మణ్యం అంత్యక్రియల్లో కుటుంబ సభ్యులు, భార్య, కుమార్తెలు కన్నీరుమున్నీరుగా విలపించగా, వారి ఆవేదన గుండెల్ని పిండేసింది. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అతనికి కన్నీటి వీడ్కోలు పలికారు. కుటుంబ సభ్యులు, సహచర ఉద్యోగులు, స్నేహితుల మధ్య అతని అంత్యక్రియలు ముగిశాయి.

జాతీయస్థాయిలో 11వ స్థానంలో టాపర్

కురబలకోట ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

మిట్స్ డీమ్డ్‌టుబి యూనివర్సిటీ కు జాతీయస్థాయిలో 11వ స్థానంలో టాపర్ గా ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామనాథన్ తెలిపారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ వారు ఎన్ పి టిఈ ఎల్ వారు సంయుక్తంగా నిర్వహించిన పరీక్షలో టాప్ 20లో కళాశాలకు 11వ ర్యాంకు గుర్తింపును పొందినట్లు తెలిపారు. మీట్స్ యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ .ఎన్. విజయభాస్కర్ చౌదరి విద్యార్థులకు ,అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఒక్కరూ సహకరించాలి

కేవీపల్లె, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:

మండలంలోని నిర్వహించనున్న ఏకీకృత కుటుంబ సర్వే (యూఎఫ్ఎస్)కి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో సుధాకర్ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ద్వారా సర్వే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మండలంలోని ప్రజలందరూ ఏకీకృత కుటుంబ సర్వేలో తమ కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ నమోదు ఆధారంగా ప్రభుత్వ పథకాలకు లబ్దిచారుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో నాగేంద్ర పాల్గొన్నారు.

రోడ్డు పనులకు ఎమ్మెల్యే వరద భూమి పూజ

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు పట్టణం లోని పొట్టిపాడు రోడ్డు పనులకు మంగళవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజ రెడ్డి భూమి పూజ చేశారు. పొట్టిపాడు రోడ్డు పనులకు మంజూరైనా 3కోట్ల 75 లక్షల రూపాయలతోపనులు ప్రారంభిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రొద్దుటూరులో త్వరలో ఆర్ అండ్ బి, పంచాయతీ నిధులతో మరిన్ని రోడ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య, మాజీ యంపిపి నంద్యాల రాఘవరెడ్డి, కేసి కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ వైస్ ఛైర్మన్ గురివిరెడ్డి, రాజుపాలెం మాజీ జెడ్పిటిసి తోట మహేశ్వరరెడ్డి, యువనాయకుడు బచ్చల వీరప్రతాప్, టిడిపి జిల్లా జెనరల్ సెక్రెటరీ జబిబుల్లా, పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, బొల్లవరం వెంకటేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ దాదిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, యనమల రామసుబ్బారెడ్డి, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి నాయకులు ఇవి సుధాకర్ రెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు, యనమల రామసుబ్బారెడ్డి, రమణ యాదవ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

నేడు 81టన్నుల యూరియా పంపిణి

దువ్వూరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

మండలంలోని 6 రైతు సేవా కేంద్రాల్లో బుధవారం 81 టన్నుల యూరియా పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి తెలిపారు. చింతకుంట, దువ్వూరు, నీలాపురం, జిల్లెల్ల, పెద్దజొన్నవరం, ఇడమడక గ్రామాల్లో యూరియా పంపిణీకి సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్కొక్క రైతు సేవ కేంద్రంలో 300 బస్తాల యూరియా ఉన్నదని అవసరమైన రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకంతో కొనుగోలు చేసుకోవాలన్నారు.

మదనపల్లిలో గృహ వివాదం

వ్యక్తిపై మహిళ దాడి

మదనపల్లి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త.

పట్టణంలోని రాజారెడ్డి కాలనీలో ఇల్లు ఖాళీ చేసే విషయమై తలెత్తిన వివాదం ఒక వ్యక్తిపై దాడికి దారితీసింది. బాధితుడు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మదనపల్లి పట్టణం రాజారెడ్డి కాలనీలో నివసించే చలపతి నాయుడు కుమారుడు వెంకటేశ్వర ప్రసాద్ (54), 2014 వ సంవత్సరం లో అదే ప్రాంతానికి చెందిన సమీప బంధువు వద్ద ఉన్న ఇంటిని రు. 2 లక్షల రూపాయలకు ఆయకం (లీజు)కు తీసుకుని నివసిస్తున్నారు. అయితే లీజుకు సంబంధించి ఎటువంటి పత్రాలు రాసుకోలేదు. మంగళవారం మహిళ ఆ ఇంటి వద్దకు వచ్చి, తాను ఆ ఇంటిని కొనుగోలు చేశానని, వెంటనే ఖాళీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆయకం డబ్బులు తిరిగి ఇచ్చే వరకు ఇల్లు ఖాళీ చేసే ప్రసక్తే లేదని వెంకటేశ్వర ప్రసాద్ స్పష్టం చేయడంతో ఆయనపై దాడి చేసింది. ఈ దాడిలో వెంకటేశ్వర ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సహాయంతో ఆయనను చికిత్స నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి వనం కోసం విరాళం.

తంబళ్లపల్లె ఫిబ్రవరి 10 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె మోడల్ స్కూల్ లో ప్రకృతి వ్యవసాయంతో పెరటి తోటలు పెంపకం పై స్పందించిన స్పెషల్ ఆఫీసర్ అమరనాథరెడ్డి పాఠశాలకు రూ 20 వేల విరాళం అందించారు. ఆయన స్ఫూర్తితో ప్రిన్సిపాల్ హేమంత్ కుమార్ పాఠశాల ప్రాంగణంలో పెరటి తోటలు పెంపకం తో పాటు ఖాళీ స్థలంలోని రాళ్లగుట్ట తొలగించడానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తున్నాడు. మోడల్ స్కూల్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రతి పాఠశాల, ప్రభుత్వ కార్యాలయాలు మనవిగా భావించి ఖాళీ స్థలాలలో పెరటి తోటలు పెంచితే ప్రకృతి వ్యవసాయం పై అవగాహన తోపాటు పర్యావరణ కాలుష్య నివారణ అందరికీ ఆదర్శంగా నిలవాల్సి ఉంది.

పోలవరం నిధుల కోతతో రైతుల హక్కులకు గండం

ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఘాటు విమర్శలు

పులివెందుల ,ఫిబ్రవరి 10 ,ప్రభాత వార్త :

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ లో పోలవరం ప్రాజెక్టుకు కేటాయించిన నిధులు అత్యంత స్వల్పంగా ఉండటంతో ఆంధ్రప్రదేశ్ రైతుల ప్రయోజనాలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి లోక్‌సభలో ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం లోక్ సభలో యూనియన్ బడ్జెట్‌పై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన, పోలవరం జాతీయ ప్రాజెక్టుకు కేవలం రూ.3,320 కోట్లే కేటాయించడం అన్యాయమని స్పష్టం చేశారు.పోలవరం ప్రాజెక్టు అసలు రూపకల్పన ప్రకారం డ్యామ్ ఎత్తు 45.7 మీటర్లు ఉండి, దాని నిల్వ సామర్థం 194 టీఎంసీలు అని ఆయన గుర్తుచేశారు. అయితే డ్యామ్ ఎత్తును 41.5 మీటర్లకు పరిమితం చేస్తే కేవలం 75 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే సాధ్యమవుతుందని, దీని వల్ల ప్రాజెక్టు ఉద్దేశమే నెరవేరదని తెలిపారు. సుమారు రూ.55 వేల కోట్ల వ్యయంతో పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్టుకు నిధులు తగ్గిస్తే ఆంధ్రప్రదేశ్ రైతుల ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బతింటాయని హెచ్చరించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌కు పర్యావరణ అనుమతులు ఇవ్వాలి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి తక్షణమే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని అవినాష్ రెడ్డి డిమాండ్ చేశారు. మొత్తంగా కేంద్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం చేసిందని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేలా కేంద్రం తక్షణమే చర్యలు తీసుకోవాలని వైఎస్ అవినాష్ రెడ్డి లోక్‌సభలో గట్టిగా డిమాండ్ చేశారు.

శివనామస్మరణతో అగస్తేశ్వరాలయం

కలికిరి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

మండలంలోని మేడికుర్తి పంచాయతీ బాహుదానది సమీపంలో వెలసిన శ్రీ అగస్తేశ్వరా లయం సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వర కు శివనామ స్మరణతో మారు మోగింది. పంచాయతీలోని ఎ ద్దులవారిపల్లి గ్రామానికి చెందిన దాతలు దేవేంద్ర, పద్మావతిలు ఆలయంలో శివకోటి కార్యక్రమం నిర్వహించారు. దీంతో గ్రామాల నుంచి అదే విధంగాపక్క మండలాల నుంచి శివకోటినామ కోలాట బృందం చెక్కభజన కళాకారులు ఆలయానికి చేరుకొని శివకోటి కార్యక్రమంలో భాగంగా శివనామాన్ని స్మరిస్తూ కోలాట బృందాలు భజనలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దాతలు దేవేంద్ర, పద్మావతిలు అన్నదాన కార్యక్రమం చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదా లు అందజేశారు. దీంతో కార్యక్రమం విజయవంతమైంది.

అందుబాటులో యూరియా

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

రబీ సీజన్‌లో సాగు చేసిన వివిధ రకాల పంటలకు సంబంధించి 165 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా రైతు సేవా కేంద్రాల చేయడం జరిగిందని సహాయ వ్యవసాయ సంచాలకులు డా.లక్ష్మీ మాధవి మండలంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు చెప్పడం జరిగింది. మండల వ్యవసాయాధికారి బి.అరవింద నాయక్ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో ఇంకా వేస్తున్న పంటలకు ఒక్కొక్క రైతు సేవా కేంద్రాలకు అయినటువంటి వెల్లటూరు, పెండ్లిమర్రి, కొండూరు, నందిమండలం-2కు 9.9 మెట్రిక్ టన్నులు చొప్పున మరియు ఈశ్వర్ ట్రేడర్స్ వారికి 9.45 మెట్రిక్ యూరియా అందుబాటులో ఉందని వాటి పంపిణీ బుధవారం చేపట్టడం జరుగుతుందని కావునా రైతులు తమ పాసుపుస్తకాలు, ఆధార్‌కార్డు తీసుకెళ్లి ఎంఆర్‌పీ ధరకే రూ.266.50కి ఎరువులు పొందగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

భద్రత చర్యలపై సమీక్షా సమావేశం

కడప క్రైం, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని పొలతల, నిత్యపూజకోన తదితర శైవక్షేత్రాల్లో ఎలాంటి ఘటనలకు తావు లేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపడుతూ డ్రోన్‌లు, సీసీ కెమెరాలతో నిఘా ఉంచి నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీసు అధికారులను ఆదేశించారు. దేవాలయాల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై మంగళవారం మంగళగిరి రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఈనెల 15న మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగాజరుగుతాయన్నారు. జిల్లాలో ప్రధానంగా కడప సబ్ డివిజన్ పరిధిలోని పొలతల, మైదుకూరు సబ్ డివిజన్ సిద్ధవటం, పోలీసు స్టేషన్ పరిధిలోని నిత్యపూజకోన, రాజంపేట పీఎస్ పరిధిలోని హత్తిరాల క్షేత్రాలకు భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాల్లో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకొని వాహనాల పార్కింగ్ కోసం అనువైన ప్రదేశాలను సిద్ధం చేయాలన్నారు. ప్రతి దేవాలయంలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని వాటిని పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో డ్రోన్ సర్వైలె

వృద్ధుడికి గాయాలు

మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త.

మంటలు అంటుకుని వృద్ధుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం తంబళ్లపల్లి మండలంలో జరిగింది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కోటకొండ పంచాయతీ, బీఎస్ఆర్ వడ్డిపల్లి కి చెందిన నాగప్ప కు వయసు పైబడడంతో మంచం పట్టాడు. కాగా ఇతనికి బీడీ తాగే అలవాటు ఉంది. ఈ క్రమంలో మంచం మీద నుండే బీడి తాగి నిప్పును ఆర్పకుండా అలాగే వదిలేయడంతో బట్టలకు నిప్పు అంటుకొని మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో చిక్కుకున్న వృద్ధుడు గాయపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంటల్ని ఆర్పి బాధితున్ని వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు.

యువకుడు ఆత్మహత్యా యత్నం

మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త.

ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్న యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె మండలం, పొన్నూటి పాళ్యంకు చెందిన ఆనంద్ మదనపల్లె పట్టణం చిత్తూరు బస్టాండ్‌లోని ఓ బేకరీలో మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ అవసరాల నిమిత్తం పలువురి వద్ద అప్పులు చేశాడు. సంపాదన తక్కువ కావడం, అప్పులు పెరిగిపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై, జీవితంపై విరక్తి చెంది, ఎలుకల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి కి రెఫర్ చేశారు.

వామ్మో శివరాత్రి వస్తున్న తగ్గని చలి పులి...!

చౌడేపల్లి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

చుట్టుపక్కలున్న పొగ మంచు

మండల వ్యాప్తంగా గత వారం రోజులుగా చలి తీవ్రత పెరిగింది. తెల్లవారు జామున 3గంటల నుంచి పొగమంచు దట్టంగా కమ్ముకొని ప్రజలను గజగజ వణికిస్తోంది. ఉదయం 10 గంటలైనప్పటికీ పొగమంచు కారణంగా ఎదరుగా వస్తున్న వాహనాలు సైతం కనిపించకుండా చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలు, వృద్ధులు ఇళ్ళకే పరిమితమవుతున్నారు. కూలీ పనులు చేసుకొని జీవించే వారి పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. సాధారణంగా ఫిబ్రవరి నెలలో చలి తీవ్రత తగ్గుతుంది. అయితే గత రెండు రోజులగా పొగమంచుతోపాటు జడివాన కురుస్తోంది. దీనివల్ల తీవ్ర చలికి వణుకుతున్నారు. మంచు తీవ్రత ఎప్పటికి తగ్గుముఖం పెడుతుందోనని అందరూ అనుకొంటున్నారు.

గంగమ్మ భక్తులకు సులభతరంగా స్కానర్లు

బోయకొండ(చౌడేపల్లి), ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

స్కానర్ గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న అధికారులు

శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో వివిధ రకాలకు చెందిన సేవలను మరింత సులభతరంగా స్కానర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం అన్నారు. ఈ మేరకు మంగళవారం కొండపై బ్యాంకు మేనేజర్‌తో కలసి సిబ్బంది ఆధ్వర్యంలో క్యూఆర్ కోడ్‌తో కూడిన గోడపత్రికలను ఆవిష్కరించారు. దేవస్థానం సాధారణ ఖాతాతోపాటుగా గోశాల, అన్నదానానికి సంబంధించిన స్కానర్లను పొందపరచినట్లు ఆయన వివరించారు. గతంలో భక్తులు విరాళాలందించేందుకు ఫోన్‌పే చేయడంలో ఇబ్బందులు పడేవారనీ, ఇకపై నేరుగా వారే చేసుకోవచ్చునని ఏకాంబరం వివరించారు. ఈ అవకాశాన్ని అమ్మవారి భక్తులు వినియోగించుకోవాలన్నారు. ఆలయ అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

12న పరికిదొన ఆవులపబ్బం

చౌడేపల్లి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

మండలంలోని పరికిదొనలో ఈనెల 12, 13తేదీల్లో ఆవులపబ్బం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాధారణంగా మండలంలోని పరికిదొన, గడ్డంవారిపల్లి, శింగిరిగుంట, నుంజార్లపల్లి, నూనెముద్దనపల్లి, కంపల్లి మరో 7 గ్రామాలకు చెందిన ప్రజలు సంక్రాంతి పండుగను జరుపుకోరు. శివరాత్రికి ముందు వచ్చే గురు, శుక్రవారాల్లో సంక్రాంతిని తలపించేలా ప్రతిష్టాత్మకంగా ఆవులపబ్బాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ప్రాంత ప్రజలు ఆవులపబ్బంలో కాటమరాజును ఆరాధించడం గమనార్హం.

సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ

కడప కార్పొరేషన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:

కడప జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో 13,14,15 వ తేదీలలో గుత్తి దగ్గర సేవాఘడ్‌లో వెలసిన బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జీ 287 జయంతి ఉత్సవాల పోస్టర్ ను కడప జిల్లా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షులు జగన్ రాథోడ్, కడప జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగార్జున మంగళవారం కడపలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకరులతో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్టీ మోర్చా, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్. ఐ. శివా నాయక్ మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు దేశంలోని బంజారాలు మూడు లక్షల మంది పాల్గొంటారని, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల నుండి బంజారాలు పెద్ద ఎత్తున పాల్గొంటారని వెల్లడించారు. ఈ ఉత్సవాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 50 లక్షల రూపాయలు మంజూరు చేసింది. ఈ ఉత్సవాలకు మంత్రులు సబితమ్మ, సత్య కుమార్ యాదవ్, పయ్యావుల కేశవులు, సంధ్యరాణి, ఎమ్మెలేలు, జిల్లా కలెక్టర్ యొక్క ఆధ్వర్యంలో ట్రస్ట్ సభ్యుల సహకారంతో అందిస్తారని తెలిపారు. కడప జిల్లా నుంచి బంజారాలు విరివిగా పాల్గొని దేవుని ఆశీసులతో పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ సురేష్ బాబు, రాష్ట్ర నాయకులు ఏం. వెంకట స్వామి నాయక్, అర్జున్ నాయక్, కృష్ణ నాయక్, నాగేంద్ర నాయక్, పీరు నాయక్ పాల్గొన్నారు.

మల్లయ్యకొండకు 37ఆర్టీసి సర్వీసులు

మదనపల్లె, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :

మహాశివరాత్రి సందర్భంగా 15న ఆదివారం తంబళ్ళపల్లె, అంగళ్ళు మల్లయ్యకొండలకు ప్రత్యేక ఆర్టీసి సర్వీసులు నడుపుతున్నట్లు వన్‌డిపో మేనేజర్ ఎం.వెంకటరమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వీటిలో మహిళలకు శ్రీశక్తి యదావిధంగా అమలులో ఉంటుందన్నారు. అంగళ్ళు-మల్లయ్యకొండకు 10బస్సులు, మదనపల్లె-తంబళ్ళపల్లెకు 20బస్సులు, తంబళ్ళపల్లె నుంచి మల్లయ్యకొండ కిందకు 6, బి.కొత్తకోట-తంబళ్లపల్లె 2, మొలకలచెరువు- తంబళ్లపల్లె 2, పెద్దమండ్యం-తంబళ్ళపల్లెకు 2 బస్సు సర్వీసులు తిరుగుతాయన్నారు. తంబళ్ళపల్లె మల్లయ్యకొండ కింద నుంచి మల్లయ్యకొండ గుడివరకు సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సులు భక్తుల సౌకర్యార్థం 37తిరుగుతాయన్నారు. అయితే వీటిలో మాత్రం శ్రీశక్తి పథకం వర్తించదు అన్నారు. ప్రయాణీకులు ఆర్టీసి బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మిద్దె పైనుంచి పడి భవన కార్మికుడు మృతి

మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త.

మిద్దె పైనుంచి పడి భవన కార్మికుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నిమ్మనపల్లి మండలం, గౌనిగారిపల్లికి చెందిన ప్రభాకర్ (40) భవన నిర్మాణ పనులు చేసుకుంటూ జీవనం చేసేవాడు. ఈ క్రమంలో మదనపల్లె మండలం, కొత్తిండ్లులో భవన నిర్మాణ పనులకు వెళ్లాడు. పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి మిద్దె పై నుంచి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితున్ని తోటి పనివారు, స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విచమించడంతో మృతి చెందాడు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గింజ నాణ్యత పెరగడానికి పొటాష్ ఎరువులు

ముద్దనూరు, ఫిబ్రవరి 10,ప్రభాతవార్త:

రైతులు సాగు చేసిన పంటలలో చీడపీడలు తగ్గి గింజ నాణ్యత పెరగడానికి పొటాష్ ఆధారిత రసాయనిక ఎరువులు చాలా ఉపయోగపడతాయని అధికారుల సూచనల మేరకు ఎరువులను పంటలపై ఉపయోగిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కోడి గాండ్లపల్లె గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం ఏర్పాటు చేసి రైతులకు తగు సూచనలు సలహాలు చేశారు. రైతులు పియం కిసాన్ పొందుతున్న ప్రతి రైతు ఎపి యప్ ఆర్ పోర్టల్‌లో విశిష్ట గుర్తింపు ఐడి కొరకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి అన్నారు. ఈ విశిష్ట గుర్తింపు ఐడి ఆదారంగానే మున్ముందు అన్ని పథకాలు లబ్ధిపొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకురాలు శిరీష, మహిళా పోలీసు మోనిక, పకృతి వ్యవసాయ సిబ్బంది రామాంజులమ్మ గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు

లక్కిరెడ్డిపల్లి: ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి, చైర్మన్ బాల సుబ్రహ్మణ్యంలు ఆదివారం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో మంచి ఫలితాలు సాధించిన వారికి మానవతా తరపున ప్రశంసా పత్రం నగదు బహుమతులు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని తల్లిదండ్రులు దైవమే రూపంలో ఈ భూమి మీద అవతరించారని ఆయన తెలియజేశారు. మంచి విద్యను అభ్యసించి ఉజ్వల భవిష్యత్తును పొందాలని ఆకాంక్షించారు. దేశాయి మార్కా రెడ్డి అంద జేసిన విద్యార్థి మంచి భవిష్యత్తు దీక్ష ప్రవర్తన నియమావళి కరపత్రాలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, కన్వీనర్ శివయ్య, ఉపాధ్యక్షుడు పకీరయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 5,28,846

లక్కిరెడ్డిపల్లి: ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

అనంతపురం గంగమ్మ ఆలయం హుండీ మంగళవారం దేవాలయ ధర్మాదాయ శాఖ వారి ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. జూన్ 25 నుంచి ఫిబ్రవరి 10 వ తేదీ వరకు 5,28,846 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా హుండీ లెక్కింపు దేవాదాయ ధర్మాదాయ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉండి లెక్కింపు నిర్వహించారు. వచ్చిన ఆదాయాన్ని బ్యాంకులో జమ చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ శాఖ అధికారి కడప డివిజన్ శివయ్య, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకులు ఆదిమూలం రామచంద్ర, రెడ్డి శేఖర్, బ్యాంకు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మ జాతర పోస్టర్ల ఆవిష్కరన

లక్కిరెడ్డిపల్లి ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

ఈనెల 18,19 తేదీలలో జరగబోవు గంగమ్మ జాతర పోస్టర్లను మంగళవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మేనల్లుడు రాయచోటి టిడిపి యువ నాయకుడు మోర్యా రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. 500 మంది పైగా పోలీసులు జాతరకు ఇవ్వాలని డిఎస్పిడి కోరామని అంతేకాకుండా ప్రశాంతంగా జాతర జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదనమోహన్, మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి, సీఐ కృష్ణంరాజు నాయక్, ఎస్ఐ గుర్రంకొండ శోభ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వెంకట్రామ రాజు, ఆదిమూలం రామచంద్ర, రమణ, కావలి ఆంజనేయులు, అర్చకులు ఆదిమూలం వంశీయులు, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేద్దాం

ముద్దనూరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

స్థానిక ఎమ్మార్వో కార్యాలయ ఆవరణలో సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ఫిబ్రవరి 12వ తేదీన చేపడుతున్న సార్వత్రిక సమ్మె కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ సమ్మె గోడ పత్రాలను అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్పొరేట్ సంస్థలనే ఎజెండాగా పెట్టుకొని కార్మికులకు అన్యాయాన్ని చేకూరుస్తున్నారని కార్మికుల హక్కులకై 12వ తేదీ దేశవ్యాప్తంగా చేపడుతున్న సార్వత్రిక సమ్మెను కార్మికులంతా కలిసి జయప్రదం చేయాలని సూచించారు. మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాలు రద్దు చేసి జీ రామ్ జి కొత్త స్కీమ్ ను తెచ్చి గ్రామీణ వ్యవసాయ కూలీలందరికీ అన్యాయం చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు, ముద్దనూరు ప్రాజెక్టు నాయకురాలు కళావతి, హైమావతి, భవాని, సుబ్బలక్ష్మి, పద్మావతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి...

చిన్నమండెం ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:

ఫిబ్రవరి 12వ తేదీన నిర్వహించ తలపెట్టిన, దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మండెం సుధీర్ కుమార్ నేతృత్వంలో సమ్మె పోస్టర్లను విడుదల చేసి, సమ్మె జయప్రదానికి పిలుపునిచ్చారు. సంఘం నాయకులతో కలిసి చిన్నమండెం మండల కేంద్రంలో పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం సుధీర్ కుమార్ మాట్లాడుతూ, దేశంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం, అన్ని రకాల ప్రజానీకాన్ని దోపిడీకి గురి చేస్తోందన్నారు. ముఖ్యంగా వ్యవసాయ కార్మికులును రైతులును దోపిడీకి, దగాకు గురి చేస్తోందని తెలిపారు. ఉపాధి పనిచేసే ప్రతి కార్మికుడు 12న జరిగే సమ్మెలో పాల్గొని పాత ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, డిమాండ్ చేయాలని కోరారు. అదే విధంగా రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకువచ్చి, రైతులను దోపిడీ చేసి కార్పొరేట్ కంపెనీల అభివృద్ధికి దోహదపడుతోందని తెలిపారు. అందుకోసం దేశ వ్యాప్తంగా సుమారు 11 జాతీయ కార్మిక సంఘాల సమన్వయంతో, ఈనెల 12న సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. ఈ సమ్మె జయప్రదం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి సుధాకర్, రామాంజులు, రమేష్, రెడ్డిప్రసాద్, నరసింహులు, బాబు, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఈశ్వర్ రెడ్డి మృతి బాధాకరం:రవీంద్రారెడ్డి

కాశినాయన ఫిబ్రవరి10 ప్రభాతవార్త:

ఉప్పులూరు గ్రామానికి చెందిన పాలకొలను ఈశ్వర్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి ఆయన పార్తివదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్యపడవద్దని ఓదార్చారు. ఆయనతోపాటు స్థానిక టిడిపి నాయకుడు పోలిరెడ్డి ఉన్నారు.

సురక్షిత బ్యాంకింగ్ కోసం ఈకేవైసీ తప్పనిసరి

- ఏపీజీబీ బ్యాంయ్ చీఫ్ మేనేజర్ భాస్కర్‌నాయక్

గాలివీడు, ఫిబ్రవరి 10(ప్రభాతవార్త):

సురక్షిత బ్యాంకింగ్, డిజిటల్ లావాదేవీల కోసం కేవైసీ తప్పనిసరిగా కలిగి ఉండాలని ఏపీజీబీ బ్యాంయ్ చీఫ్ మేనేజర్ భాస్కర్‌నాయక్ తెలిపారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా మంగళవారం గాలివీడులో ప్రత్యేక అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ యువత, మహిళలు, గ్రామస్తులకు వాల్యూ అకౌంట్ల ప్రాముఖ్యతను వివరించారు. అలాగే సైబర్ మోసాల నుంచి ఎలా జాగ్రత్తలు పాటించాలనే అంశంపై స్పష్టమైన అవగాహన కల్పించారు. సమావేశం అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించగా, స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా సీసీ రాజగోపాల్, వీఓఏ శ్రీదేవి, విడ్స్ సీఎఫ్ఐ కౌన్సిలర్ పవన్‌కుమార్, ప్రసాద్, సునీల్‌తో, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

న్యాయమైన ఆర్థిక డిమాండ్లను పరిష్కరించాలి

- ముఖ్యమంత్రికి పోస్ట్‌కార్డు ద్వారా యూటీఎఫ్ విజ్ఞప్తి

గాలివీడు, ఫిబ్రవరి 10(ప్రభాతవార్త):

యూటీఎఫ్ రాష్ట్ర శాఖ కార్యాచరణలో భాగంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయంగా ఇవ్వాల్సిన పీఆర్‌సీ, ఐఆర్, పెండింగ్ డీఏలను చెల్లించేందుకు స్పష్టమైన రోడ్ మ్యాప్ ప్రకటించాలని ముఖ్యమంత్రికి పోస్ట్‌కార్డు ద్వారా విజ్ఞప్తి చేస్తున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ జాబీర్ తెలిపారు. మంగళవారం గాలివీడులోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో పోస్టు కార్డు క్యాంపెయిన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ దాదాపు 3 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉందని, వెంటనే పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి 29 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశార. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ అమలుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ గాఇవీడు మండల నాయకులు మహబూబ్‌బాషా, ఖాదర్‌వలి, శ్రీనివాసులురెడ్డి, ఇమ్రాన్, ఉపాధ్యాయులు సయ్యద్‌బాషా, షఫీవుల్లా, సాజిదాబీ, పర్వీన్‌బేగం, పాతిమున్నీసా, జమాల్‌బి, నజ్మా పాల్గొన్నారు.

అభివృద్ధిపై కలెక్టర్‌కు వినతి : ఎమ్మెల్యే

మదనపల్లె, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :

విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మదనపల్లె నియోజకవర్గ అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం అన్నమయ్య కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే కలెక్టర్‌ను కలసి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకర్లతో మాట్లాడుతూ ఆటోనగర్ అభివృద్ధి, మార్కెట్‌యార్డు తరలింపుపై కలెక్టర్‌తో చర్చించినట్లు తెలిపారు. పట్టణంలో నెలకొన్న రోడ్ల ఆక్రమణల తొలగింపు, ట్రాఫిక్ సమస్య నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. మదనపల్లె అభివృద్ధికి కలెక్టర్ సంపూర్ణంగా సహకరించనున్నట్లు తెలిపారు. త్వరలోనే మదనపల్లెలో మినిస్టేడియం నిర్మాణానికి కూడా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వేసవిలో నియోజకవర్గంలో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలుచేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికోసమే కూటమినేతలు చేష్టలు

వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్

మదనపల్లె, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :

సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

రాజకీయ లబ్ధికోసమే కూటమి నాయకులు తిరుమల ప్రసాదంపై అసత్య ప్రచారం చేస్తున్నారని వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ తెలిపారు. మంగళవారం వైకాపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా పవిత్రమైన లడ్డు ప్రసాదంపై రోజుకొక ఆరోపణలు చేయడం భావ్యం కాదన్నారు. సిఎం దిగజారుడు రాజకీయానికి పరాకాష్ఠ అంటూ ధ్వజమెత్తారు. సిబిఐ, సిట్ తిరుమల లడ్డూలో కల్తీ జరగలేదని తేల్చి చెప్పిన కూటమి నాయకులు తిరుమల ప్రసాదంపై లేనిపోని అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు తప్పును ఒప్పుకొని వెంకటేశ్వరస్వామికి క్షమాపణ చెప్పి పాపపరిహారం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు ప్రసాద్‌బాబు, శ్రీనివాసులు, సుధాకర్, నాయకులు మయూరి రఘునాథ్‌రెడ్డి, కొత్తపల్లె మహేస్, మిల్టి మల్లికార్జునరెడ్డి, డాక్టర్ అనీల్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులుగా ఏవి.సుబ్బారెడ్డి

మదనపల్లె, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :

రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ ఏవి.సుబ్బారెడ్డి గెలిపొందారు. మంగళవారం విజయవాడలో జరిగిన రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఎన్నికల్లో ఆయన రాష్ట్ర సభ్యులుగా గెలిపొందారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి చక్రదర్ ఐఏఎస్ చేతుల మీదుగా నియామకపు పత్రాన్ని అందుకొన్నారు. ఇప్పటికే డాక్టర్ ఏవి.సుబ్బారెడ్డి ఫెడరేషన్ ఆఫ్ ప్రైవేటు హాస్పిటల్స్ అండ్ నర్సింగ్‌హోమ్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా నేషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా ఉంటున్నారు. ఈయన రాష్ట్రమెడికల్ కౌన్సిల్ సభ్యులుగా గెలుపొందడంపై ఆయనను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నటువంటి పారిన్‌మెడికల్ గ్రాడ్యుయేట్స్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటానన్నారు.

కలెక్టర్‌ను కలసిన ఉడా ఛైర్మెన్

మదనపల్లె, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :

అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మలను మంగళవారం కలెక్టరేట్‌లో ఉడా ఛైర్మెన్ డాక్టర్ సురేష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి శాలువకప్పి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఉడా ఛైర్మెన్ తన కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ స్కీమ్‌పై రియల్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఛైర్మెన్ మాట్లాడుతూ వెంచర్లన్నీ క్రమబద్ధీకరణ చేసుకోవాలని రియల్టర్లకు సూచించారు. అక్రమంగా లేవుట్లు వేసి ప్లాట్లు విక్రయిస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను ప్రతి వెంచర్ దారుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఛైర్మెన్ వెంట సెక్రటరీ పిఆర్.మనోహర్, టిడిపి నాయకులు సీడ్ మల్లికార్జుననాయుడు, స్టోర్ మోహన్, టి.క్రిష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పిపిపి మోడల్‌కు వైసీపీ పాలకవర్గం వ్యతిరేకం..

బడ్జెట్ ఆమోదం.. స్మార్ట్ స్ట్రీట్ వైండింగ్ మార్కెట్ ఏర్పాటుపై అధ్యయన కమిటీ.. మేయర్ పాకా సురేష్ కుమార్..

కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:

కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం మంగళవారం మేయర్ పాకా సురేష్ అధ్యక్షతన సజావుగా కొనసాగింది. భోజన విరామ అనంతరం బడ్జెట్ సమావేశం నిర్వహించి సభ ఆమోదించింది. అజెండాలోని పొందుపరిచిన 65 అంశాలలో రెండు, మూడు మినహా మిగిలినవి పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించారు. మేయర్ పాకా సురేష్ కుమార్, కమిషనర్ మనోజ్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రం, ఎస్ఈ చెన్నకేశవరెడ్డి సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఔట్సోర్సింగ్ కార్మికులు, ఇంజనీరింగ్ సెక్షన్ వాటర్ సప్లై లైటింగ్ విభాగంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులు (ఆప్కాస్) ఐటి ఫిట్టర్ ఎలక్ట్రికల్ వేతనాలు పెంపు ప్రతిపాదనను సభ్యులు ఆమోదించారు. ఎర్రముక్కపల్లె వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ, నష్టపరిహార చెల్లింపుపై చర్చించారు. రూ.3.57 కోట్లతో భూ సేకరణకు ఆమోదం తెలిపారు. రైల్వే, రెవిన్యూ శాఖలను భాగస్వాములు చేయాలని తీర్మానించారు. 7 కార్పొరేషన్లలో స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్లో ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కడప నగరంలో 100 షాపులతో కూడిన మార్కెట్ ఏర్పాటును కార్పొరేటర్లు వ్యతిరేకించారు. దీనివల్ల స్థానికులకు ఉపాధి కోల్పోతారని వైసిపి సభ్యులు మల్లికార్జున్, షఫీ, బాలస్వామి రెడ్డి డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. దీంతో మార్కెట్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై ఐదు మందితో కూడిన కమిటీని మేయర్ పాకా సురేష్ ప్రకటించారు. బిపిఎస్‌పై వారం సమీక్షించాలని మేయర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐటీ సర్కిల్ నుంచి ఊటుకూరు బ్రిడ్జి వరకు రోడ్డు విస్తరణ ప్రతిపాదనను సభ ఆమోదించింది. ఇదే తరుణంలో ఐటిఐ సర్కిల్ ను విస్తరించాలని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. నగరంలో పిపిపి విధానానికి వ్యతిరేకంమని మల్లికార్జున అన్నారు. దీనిపై ఓటింగ్ పెట్టాలని కోరారు. దీంతో కార్పొరేటర్లందరూ పిపిపి విధానానికి వ్యతిరేకంగా తీర్మానం చేశారు. దీనిపై స్పందించిన మేయర్ పిపిపి విధానంపై ప్రజా సంఘాల నుంచి వ్యతిరేక వినతి వచ్చాయన్నారు. ప్రభుత్వ ఆస్తుల అభివృద్ధికి ప్రభుత్వమే నిధులు కేటాయించి నిర్వహించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనను పంపాలని నిర్ణయించారు. ప్రతిపాదన ఎవరు పెట్టారని మరో సభ్యులు షఫీ అధికారులను నిలదీశారు. నగరంలో సోలార్ ప్రాజెక్టుల కోసం రూపొందించిన పిపిపి విధానాన్ని సభ వ్యతిరేకించింది. సాధ్యాసాధ్యాలను పరిశీలన కోసం కమిటీ వేశారు. రోడ్ల విస్తరణ సంబంధించిన మాస్టర్ ప్లాన్ స్పష్టంగా లేదని, దీనిని పూన పరిశీలించాలని గతంలో కోరామని సభ్యులు పేర్కొన్నారు. వైజాగ్ లో మాస్టర్ ప్లాన్ రద్దు చేశారని మేయర్ పాక సురేష్ సమావేశం దృష్టికి తెచ్చారు. కడప

లో కూడా రద్దుచేసి, సరైన విధానాన్ని రూపొందించాలన ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను కోరారు. పారిశుద్ధంపై మరింత శ్రద్ధ వహించాలని సభ్యులు కోరారు. కుక్కల బెడదను నివారించాలని విజ్ఞప్తి చేశారు. ప్రకాష్ నగర్ లో ప్రధాన మురుగునీటి కాలువను పూర్తి చేయాలని, కల్వర్టులు పూర్తి చేయాలని, వీధిలైట్లు వేయాలని కార్పొరేటర్ కే.బాబు కోరారు. పెండింగ్ లో ఉన్న బుగ్గ వంక ప్రహరీ గోడ పూర్తి చేయాలని సమ్మెట శ్రీవాణి కోరడంతో సభ ఆమోదించింది. మాజీ సైనికుల ఇంటి పన్నులో ప్రత్యేక రాయితీ ఇవ్వాలని సభ్యులు మల్లికార్జున్ కోరారు. కార్పొరేషన్‌కు సంబంధించి కోర్టు కేసులు ఎన్నిని, వాటి ఖర్చు ఎంత అవుతుందని సభ దృష్టికి మల్లికార్జున తెచ్చారు. ఖర్చులు ఎక్కువవుతున్నాయని దీనిని నివారించాలని కోరారు. భోజన అనంతరం జరిగిన బడ్జెట్ సమావేశంలో 2025, 26 సంబంధించిన బడ్జెట్‌ను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆదాయం రూ. 51484.31 లక్షలు. ఖర్చు 44728.57 లక్షలు. మిగులు నిల్వ రూ. 6755.74 లక్షల అంచనాతో బడ్జెట్ ఆమోదించారు. డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి, కార్పొరేటర్లు చంద్రహాస్ రెడ్డి మల్లికార్జున్, బాబు, షఫీ, బాలస్వామి రెడ్డి, మక్బూల్ బాషా సభలో ప్రస్తావించిన అంశాలపై అధికారులు సమాధానం ఇచ్చారు. మీడియాతో మేయర్ పాకా సురేష్ మాట్లాడుతూ కార్పొరేషన్ ఆర్థిక సంక్షోభంలో ఉన్న కారణంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో వెనుకబడి ఉన్నామని తెలిపారు. నగరపాలక సంస్థకు రావలసిన స్టాంపు డ్యూటీ వాటా నెలకు రూ. 1.50 కోట్లు,36 నెలలకు రూ. 54 కోట్లు రావాల్సి ఉండగా, ఇవి ఇంత వరకు రాలేదని చెప్పారు. దీంతో కార్పొరేషన్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉందని పేర్కొన్నారు. నిధులు వస్తే అభివృద్ధి చేస్తామని తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, సెక్రెటరీ నరసారెడ్డి, ఎంహెచ్ఓ రమేష్, ఈ ఈ విజయ్ కుమార్ రెడ్డి, ఆర్ఓ లు కన్నయ్య, రాజశేఖర్, డి ఈ ఈ మణి గోపాల్ రెడ్డి, దిల్షాద్, సిపి శైలజ, పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలి

తంబళ్లపల్లె ఫిబ్రవరి 10 ప్రభాతవార్త ః

టెన్త్ క్లాస్ విద్యార్థులు పరీక్షల్లో 100 ఉత్తీర్ణతే లక్ష్యంగా కష్టపడి చదవాలని స్పెషల్ ఆఫీసర్ డిఎల్‌డిఓ అమరనాథరెడ్డి సూచించారు మంగళవారం ఆయన మోడల్ స్కూల్ టెన్త్ క్లాస్ విద్యార్థుల అభ్యసనా స్థాయిని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి ఉన్నత చదువులకు ఈ టెన్త్ క్లాస్ విజయ సోపానంగా నిలుస్తుందని ప్రతి విద్యార్థి పోటీ తత్వం పెంచుకొని పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరచాలని సూచించారు. టెన్త్ క్లాస్ విద్యార్థులకు సంబంధిత సబ్జెక్టుల ఉపాధ్యాయులు వారి సందేహాలను దగ్గరుండి పరిష్కరించి టెన్త్ లో ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రత్యేక భాధ్యత తీసుకోవాలని ప్రిన్సిపల్ హేమంత్ కుమార్‌కు సలహా ఇచ్చారు.

సదరన్ జోన్
కిసాన్ మేళాకు రైతులకు ఆహ్వానం

డాక్టర్ మంజుల

పీలేరు ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:

2025, 26 సంవత్సరానికి గాను సదరన్ జోన్ కి సంబంధించి ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ నెల 12వ తేదీన తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నందు కిసాన్ మేళా నిర్వహిస్తోంది. ఇందు మూలంగా అన్నమయ్య జిల్లా రైతులందరికీ ఈ కార్యక్రమంలో పాల్గొనవలసినదిగా కృషి విజ్ఞాన కేంద్రం, కలికిరి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.మంజుల పత్రికా ముఖంగా కోరారు. ఈ ఉత్సవంలో వ్యవసాయ మరియు అనుబంధ రంగాలకు సంబంధించి నూతన వంగడాలు, యాంత్రీకరణ మరియు సాంకేతికత గురించి ప్రదర్శన శాలలు, చర్చలు ఉంటాయి. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవలసినదిగా రైతులకు పిలుపునిచ్చారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

మైదుకూరు, ఫిబ్రవరి 10,ప్రభాతవార్త :

మండలంలోని అన్నలూరు, సోమయాజుపల్లి గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి ఇ.బాల గంగాధర్ రెడ్డి అధ్యక్షతన ప్రభుత్వ పథకాలు, మోతాదు మేరకు ఎరువులు వాడడం, పంటలో వచ్చే సమస్యలపై రబీ పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామాల్లో సాగు చేసిన మినుము, మొక్కజొన్న, నూగు పంటల స్థితిగతుల గురించి, పంటలో వచ్చే సమస్యల గురించి రైతులతో చర్చించడం జరిగింది. ప్రస్తుతం రబీ పంట నమోదు కార్యక్రమంలో భాగంగా రైతు సేవా కేంద్ర సిబ్బంది అందరూ తమ పరిధిలో ఉన్న గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేస్తారని రైతులు తప్పనిసరిగా సాగుచేసిన ప్రతి పంటను తెలియజేసి నమోదు చేయించుకోవాలని పంట చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం ద్వారా సున్నా వడ్డీ పంట రుణాలు, పంట నష్ట పరిహారం, క్రాప్ ఇన్సూరెన్స్, కనీసం మద్దతు ధర, ప్రభుత్వం ద్వారా పంట కొనుగోలుకు మొదలగు వాటికి అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెరికల్చర్ అధికారి గుర్రప్ప మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు గురించి పట్టుపురుగుల పెంపకం ద్వారా కలిగే ఉపయోగాలు గురించి రైతులకు క్లుప్తంగా వివరించడం జరిగింది. అనంతరం ఏ.ఒ ఆధ్వర్యంలో పంట పొలాలను సందర్శించి వాటిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమములో మండల వ్యవసాయ అధికారి ఇ.బాల గంగాధర్ రెడ్డి,సెరికల్చర్ అధికారి గుర్రప్ప, వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయండి

కడప క్రైం, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేధిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాష్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ షెల్కే నవికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ఏఎస్పీ ప్రకాష్‌బాబు పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహించి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వద్ద ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీసు సిబ్బంది ప్రశాంతంగా తమ సమస్యలను వరించడానికి సహాయం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 89 పిటీషన్లు వచ్చాయి. ఈ కార్యక్రమంలో మహిళా డీఎస్పీ బాలస్వామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

గాలివీడు, ఫిబ్రవరి 10(ప్రభాతవార్త):

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎంఈఓ-2 శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం గాలివీడులోని శ్రీ రవిచంద్ర సీబీఎస్ఈ స్కూల్ నందు మత్తురహిత సమాజం నైతిక విలువలతో కూడిన జీవనం అనే అంశంలో భాగంగా సేవాభావం స్వచ్ఛంధ సంస్థ నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత జీవన విధానం అనుసరించి ఒత్తిళ్లను అధగమించడానికి యువత మత్తుపదార్థాలను వినియోగించడం జరుగుతున్నదని దానివలన చిన్న వయసులోనే ప్రాణాంతకమైన వ్యాధులతో బాదపడటం దీర్ఘకాలికమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవడం జరుగుతుంది కావున సమస్యలను తల్లిదండ్రుల దృష్టికి కానీ ఉపాధ్యాయుల దృష్టికి కానీ తీసుకొచ్చి నైతిక విలువలతో కూడిన జీవనాన్ని గడపాలని ఆయన విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లిజాజాయ్, సేవాభావం స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఆర్యశంకర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ సిబ్బందిదే

పీలేరు ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:

మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు, డికెటి ,గయ్యాళి వాటి భూములపై ఎవరైనా అక్రమదారులు స్వాధీనం చేసుకుంటే అటువంటి వాటిపై గ్రామాలలో ఉన్న రెవెన్యూ అధికారులు సర్వేలు వీఆర్ఏలు తోపాటు సిబ్బంది కూడా పర్యవేక్షించాలని పీలేరు తహసిల్దార్ శివకుమార్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పీలేరు పట్టణం దినదిన అభివృద్ధి చెందుతూ రెవెన్యూ పరిధిలోని డివిజనల్ కార్యాలయం ఏర్పాటు చేయడంతో భూముల ధరలు ఆకాశాన్ని అంటున్నట్లు తెలుస్తుందని రాబోయే కాలంలో పీలేరు పట్టణం మున్సిపాలిటీగా కూడా ఏర్పాటు అయ్యేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది .అందులో భాగంగా కొంతమంది అక్రమదారులు గ్రామాలలో ఉన్న ప్రభుత్వ భూములలో వ్యవసాయ భూములు సాగించడమే కాకుండా అమాయకులకు ఎరవేసి ప్లాట్లు రూపంలో విక్రయిస్తున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. అదే కోవలో ఎర్రగుంటపల్లి తలపల, గూడరేవుపల్లి బోడుమలు వారి పల్లి గ్రామాలలో ఇప్పటికే రీ సర్వే కార్యక్రమాలు జరుగుతున్న వారి కళ్ళు కప్పి ప్రైవేటు భూములను ప్రభుత్వ భూములను ఆక్రమణకు గురి చేస్తూ వారి వారి సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నట్లు ప్రజలు తెలుపుతున్నారని ఇకనైనా సంబంధిత అధికారులు అటువంటి వాటిని గుర్తించి ఒకవేళ గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉంటే ఆయా గ్రామాలలో ప్రజలకు కనీస అవసరాలకు ఉపయోగించుకునేందుకు ఉన్నత అధికారులతో చర్చించి వారికే చెందే విధంగా పట్టాలు మంజూరు చేసేందుకు సిఫారసు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు ముఖ్యంగా గ్రామాలలో ప్రతిరోజు రెవెన్యూ అధికారులు సర్వే చేసి గ్రామ పరిధిలో ఉన్న ప్రజలతో వారి అవసరాల గుర్తించి సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు వెళ్లాలని అటులేని పక్షంలో వారిపై నివేదికలు ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ ప్రసాద్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ మురగయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు చేస్తున్న తహసిల్దార్ శివకుమార్

విద్యార్థులకు ప్రశంసపత్రాలు ప్రధానం

అభినందిస్తున్న దృశ్యం

మదనపల్లె, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :

ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రెజెంటేషన్స్ ఇవ్వడంతో పాటు సాంకేతిక నైపుణ్యాలను చక్కగా ప్రతిభించినందుకు న్యాయ నిపుణుల నుంచి ప్రశంసా పత్రాలు అందుకొన్నారు. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో మూడవ సంవత్సరం బీటెక్ చదువుతున్న విద్యార్థులు గత 6,7వ తేదీల్లో విజయవాడలోని ధనేకుల ఇనిస్యూట్‌ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో నిర్వహించిన అమరావతి క్వాంటమ్‌వ్యాలీ హ్యాకథాన్-2025 గ్రాంటుపైనల్ కార్యక్రమం నిర్వహించారు. ఆదిత్య ఇంజనీరింగ్ విద్యార్థులు తమ ప్రాజెక్టులను సమర్థవంతంగా ప్రదర్శిస్తూ న్యాయనిపుణులచే అభినందనలు అందుకొన్నారు. వీరి విజయాన్ని అభినందిస్తూ మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి అభినందించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆర్.రామలింగారెడ్డి మాట్లాడుతూ బిటెక్ విద్యార్థులందరూ క్వాంటమ్ టెక్నాలజీపై అవగాహన పెంపొందించుకొని, క్వాంటమ్ అల్గారిథమ్స్‌కు పట్టు సాధించాలని సూచించారు. ఈకార్యక్రమంలో యాజమాన్యం సభ్యులు ఆర్.రామ్మోహన్‌రెడ్డి, ఎన్.నాగమల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాముడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో భూసార పరీక్షలు కీలకం

రాజుపాళెం, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

ప్రస్తుత తరుణంలో ప్రకృతి వ్యవసాయం రైతుకు ఎంతో లాభసాటని ఈ వ్యవసాయంలో భూసార పరీక్షలు కీలకమని కడప డిపిఎం ప్రవీణ్ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలోని పంట పొలాల్లో భూసార పరీక్షల కొరకు మట్టి నమూనాలను మంగళవారం డిపిఎం ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సేకరించడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలలో నివేదికల ఆధారంగా పంటల సాగు, వాడవలసిన ఎరువులను తెలుసుకోవచ్చని దీంతో రైతుకు లాభసాటిగా ఉంటుందని ఆయన తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో రైతుకు లాభము, పంట పొలాలకు ఆరోగ్యకరమని ప్రకృతి వ్యవసాయం వలన కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం చైర్మన్ సంజీవరెడ్డి, భరత్, ఆదినారాయణ, రవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రజకుల ఆత్మగౌరవ నినాదమే ప్రధాన లక్ష్యంగా 20న మహా ధర్నా

ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్‌లోని రజకుల ఆత్మగౌరమ నినాదంతో ఈనెల 20న తాడేపల్లిలో నిర్వహిస్తున్న మహా ధర్నాలో పెద్ద ఎత్తున రజకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ప్రొద్దుటూరులో రజక వృత్తిదారుల సమస్యలు తెలుసుకునేందుకు విచ్చేసిన సందర్భంగా ఎన్నికల ప్రణాళిక హామీ అమలుకై ఈనెల 20వ తేదీ శుక్రవారం తాడేపల్లిలో సంఘం ఆధ్వర్యంలో జరిగే మహా ధర్నాకు సంబంధించిన కరపత్రాలతో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేస్తామన్న కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రజకులకు సామాజిక రక్షణ చట్టం వెంటనే ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయాలని, రజక కార్పొరేషన్‌కు ప్రతి సంవత్సర రాష్ట్ర బడ్జెట్లో కనీసం 1000 కోట్ల రూపాయలు కేటాయించి ఆ నిధులను 90 శాతం సబ్సిడీతో ప్రతి రజక కుటుంబానికి 3 లక్షల రూపాయల చొప్పున బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని రజక లాండ్రీ వృత్తిదారులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు సబ్సిడీపై మంజూరు చేయాలని, సామాజిక సేవా వృత్తి నిర్వహిస్తున్న రజకుల శ్రమను గుర్తించి 50 సంవత్సరాలు వయసు పూర్తయిన రజకులకి వృద్ధాప్య (చేనేత, గౌడ, మత్స్యకారులు మాదిరిగా) వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ జీవో ఎంఎస్ నెంబర్ 27 ప్రకారం వివిధ ప్రభుత్వ

డిపార్ట్మెంట్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులు రజక యువతీ యువకులకు భర్తీ చేస్తూ ఉపాధి కల్పించాలని, వృత్తిచెరువులు, ధోబీ ఘాట్ స్థలాలపై రజకులకే పూర్తి హక్కు కల్పించాలని కోరారు. ఈ మహాధర్నాలో రజక ఉద్యోగ కార్మిక, వృత్తిదారులు, మహిళలు, యువతీ యువకులందరూ ఫిబ్రవరి 20వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు తాడేపల్లి మెయిన్ రోడ్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరుగుతున్న "మహాధర్నా" నందు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీను, సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా చేనేత సంఘం అధ్యక్షుడు ఓబులేసు, రజక వృత్తిదారు సంఘం పట్టణ అధ్యక్షుడు బాలసుబ్బయ్య కార్యదర్శి నాగేంద్ర, సభ్యులు జయనరసింహులు, షేక్షావలీ, కొండయ్య, రాజ, బాలాజీ, వెంకట సుబ్బయ్య, శ్రీను, నాగార్జున, సుజాత, పద్మ, లక్ష్మీ, యశోద తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు మూడు ఇళ్లలో చోరీ

:16 తులాలు బంగారు, , 30 తులాలు వెండి అపహరణ

:పట్టపగలు దొంగతనాలపై బెంబేలెత్తుతున్న ప్రజలు

బద్వేలు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :

పట్టణంలో పట్టపగలు చోరీలపై ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రిళ్లు చోరీలు జరగడం చూశాం కానీ, పట్టపగలు, మధ్యాహ్న సమయంలో చోరీలు జరగడం చూస్తుంటే ఇది పక్కా పథకం ప్రకారం చోరీ చేయడమే కాకుండా చుట్టుపక్కలవారు భయభ్రాంతులకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. మున్సిపాలిటీలోని చెన్నంపల్లె పరిసరాలలో రెండుచోట్ల, సురేంద్రనగర్‌లో ప్రైవేటు ఉపాధ్యాయుని ఇంట్లో ఒక చోట చోరీ జరిగింది. చెన్నంపల్లె పరిధిలోని వీరయ్య, తిరుపతమ్మ పొలం పనులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. ఒక్కసారిగా అవాక్కయిన వారు ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో బీరువా తలుపులు తెరిచి చిందరవందరగా బట్టలు వేయడం పరిశీలించారు. ఇంట్లో ఉన్న బంగారు , వెండి నగదు కనపడలేదు. అలాగే సురేంద్రనగర్‌లో ఉంటున్న ప్రైవేటు ఉపాధ్యాయుడు గోపి, అతనిభార్య ఇద్దరు పాఠశాలకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువా పగులకొట్టి ఉండడమే కాకుండా వస్తువులు చిందరవందరగా ఉండడం చూసి భయపడ్డారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఈ సంఘటనను చూసి అవాక్కయారు. మధ్యాహ్న సమయంలో గంట అటు, ఇటు ఈ మూడు ఘటనలు జరిగి ఉండవచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. పట్టపగలు చోరీ జరగడంపై పలు అనుమానాలకు దారి తీస్తున్నాయి. ఈ చోరీలో మూడు ఇళ్లలో 16 తులాల బంగారు. 30తులాలు వెండి 60వేలు నగదు అపహరణకు గురైనట్లు తెలుస్తోంది. వెంటనే క్లూస్‌టీం రంగంలోకి దిగి వేలిముద్రలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

23 మంది గర్భిణీలకు వైద్య పరీక్షలు

దువ్వూరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభయాన్ కార్యక్రమం కింద 23 మంది గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సురేష్ బాబు, హేమలతలు చికిత్సలు అందజేశారు. వీరిలో 15 మంది కష్టతరమైన గర్భిణీలు ఉన్నందున వారికి స్కానింగ్, ఆరోగ్య పరీక్షలు అలాగే రక్త, షుగర్ పరీక్షలు నిర్వహించి వారికి సూచనలు సలహాలు అందజేశారు. రక్తహీనత తక్కువ ఉన్న గర్భిణీలు అంగన్వాడి కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు జరిగే విధంగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయ కుమారి, రాజగోపాల్, శాంతకుమారి, బయన్న తదితరులు పాల్గొన్నారు.

కోటి రూపాయలతో సిసి రోడ్ నిర్మాణం

ములకలచెరువు, ఫిబ్రవరి,10, ప్రభాతవార్త:

మండలంలోని, కదిరినాదిని కోట పంచాయతీ, గాలేటివారి పల్లి సమీపంలో కనుగొండ లో వెలసిన కనుగొండ రాయ స్వామి ఆలయానికి ఎన్ ఆర్ జి స్. నిధులు, రూ. కోటి రూపాయలతో సిసి రోడ్ నిర్మాణ పనులు ముమ్మరంగా కాంట్రాక్టర్ మంత్రి ప్రసాద్ రెడ్డి ముమ్మరంగ చేపట్టారు. శివరాత్రి పండుగ కోసం వేల మంది భక్తజనాలు కనుగొండ రాయ స్వామి ఆలయానికి విచ్చేస్తారు. కావున భక్తుల సౌకర్యార్థం కోసం సిమెంట్ రోడ్ నిర్మాణం పనులు వేగవంతం చేశామని కాంట్రాక్టర్ తెలిపారు. అంతేకాకుండా ఈ ఆలయానికి కొన్ని ఏళ్లుగా మట్టి రోడ్డు, రాళ్లు, రప్పలతో, గుంతలతో ఉండేదని ఇప్పుడు సిమెంట్ రోడ్ నిర్మాణంతో భక్తాదులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఆలయ పూజారి శ్